క్లుప్తంగా

నేత్రపర్వంగా హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం



ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌లో గురువారం శ్రీ సంకట విమోచన హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో పండితులు స్వామి వారికి విశేష మన్యు సూక్తాభిషేకం, హోమం, 1008 తమల పాకులతో అర్చన చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పండితులు మాధవ శర్మ, కార్తీక్ శర్మ, సాయిని మహేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు

చేతిపంపులు కనుమరుగు!



అనంతసాగర్‌లో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

చిన్నకోదూరు(సిద్దిపేట): గ్రామాల్లో చేతిపంపులు కనుమరుగవుతున్నాయి. నాడు వీధివీధికి చేతి పంపులు ఉండేవి. ఈ పంపుల ద్వారా ప్రజలు నీటిని తెచ్చుకునేవారు. ప్రభుత్వం తాగునీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజలు వీటిని వినియోగించడం తగ్గించారు. గ్రామాల్లో వేసవిలో బావులు, చెరువులు ఎండిపోయినప్పుడు, పంచాయతీ మోటార్లు పనిచేయని సమయంలో ప్రజలు చేతి పంపులపై ఆధారపడేవారు.

బాలసాహితీవేత్తకు సత్కారం



రాజేశంను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశంను తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారని పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో రెండు రోజులుగా బాల సాహిత్య సమ్మేళనం జరుగుతోంది. గురువారం బాలసాహిత్య పరిణామాలు అంశంపై రాజేశం ప్రసంగించినట్లు చెప్పారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు



హేమలతను సన్మానిస్తున్న డీఎంహెచ్‌ఓ

నంగునూరు(సిద్దిపేట): ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించిన వారికి సంఘంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. రాజగోపాల్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో సీహెచ్‌సీగా పనిచేస్తున్న హేమలత గురువారం ఉద్యోగ విరమణ చేశారు. నంగునూరులో నిర్వహించిన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ హాజరై హేమలతను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లిష్ట సమయంలో వైద్య సిబ్బంది అనేక సవాళ్లను ఎదుర్కొని రోగులకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అంజలిరెడ్డి, మహేందర్‌గౌడ్, లింగంగౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారికి 'ఆపన్నహస్తం'

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి 'ఆపన్నహస్త మిత్రబృందం' చేయూతనందించింది. గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన ఎంకమొల్ల ప్రణీత్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స చేయించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో కిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు. ప్రణీత్‌కు శస్త్ర చికిత్స చేయాలంటే సుమారు రూ. 50 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు తమ 90వ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రణీత్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్ర బృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్, ఉపాధ్యక్షుడు సాయి, సహాయ కార్యదర్శి స్వామి, సభ్యులు సత్యనారాయణ, అనిల్, గౌతం కృష్ణ, గణేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. మిత్తి కట్టలేక

అప్పులు చేసి పంచాయతీ భవన నిర్మాణాలు

శిథిలమైన పంచాయతీ భవనాల స్థానంలో నూతన భవనాలతో పాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు పక్కా భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరయ్యాయి. కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా, మరికొన్ని గ్రామాల్లో ప్రారంభం కాలేదు. అప్పులు చేసి నిర్మించిన వాటికి బిల్లులు రాక పోవడంతో మాజీ సర్పంచులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. వడ్డీలు కట్టలేకపోతున్నాం మహాప్రభో బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- బిల్లులు రాక నిలిచిన కొన్ని నిర్మాణాలు
- లబోదిబోమంటున్న మాజీ సర్పంచ్‌లు
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో మొత్తం 32 గ్రామపంచాయతీలుండగా 2023లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 14 పంచాయతీలకు సొంత భవనాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.2.80 కోట్లను మంజూరు చేశారు. మార్చిలోగా వీటి నిర్మాణాలు పూర్తి చేయాలి. కానీ, సీసీరోడ్లు, పంచాయతీ భవనాలు ఒకేసారి మంజూరు కావడంతో రోడ్లను ముందుగా పూర్తి చేశారు. తర్వాత పంచాయతీ భవనాల నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తికాలేదు. చాలాచోట్ల ప్రారంభం కాలేదు. మండలంలోని కేశనాయక్‌తండా, మైసమ్మవాగుతండా గ్రామాల్లో స్థల వివాదాలతో నిలిచిపోయాయి.



అసంపూర్తిగా చౌటపల్లి గ్రామ పంచాయతీ భవనం

సకాలంలో బిల్లులు రాక..

నిర్మాణాలు పూర్తి కాకపోవడానికి సకాలంలో బిల్లులు రాకపోవడమూ ఒక కారణమని మాజీ సర్పంచ్‌లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లకుంట, మంచినీళ్లబండ, మసిరెడ్డితండా, గండిపల్లి గ్రామాల్లో భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని కానీ, బిల్లులు మాత్రం రాలేదని చెబుతున్నారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో నిర్మాణాలను పూర్తి చేసేందుకు సర్పంచ్‌లు ఆసక్తి చూపడంలేదు.

రూ.10 లక్షలు అప్పుచేసి పనులు చేశా



పంచాయతీ భవన నిర్మాణానికి సుమారుగా రూ.10 లక్షలు అప్పులు చేశా. నిర్మాణాన్ని తుదిదశకు తెచ్చా. చేసిన పనులకు నేటికీ ఒక్కపైసా మంజూరు కాలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. రేపు మాపు అంటూ వాళ్లు కాలం వెళ్లదీస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు మాత్రం పెరిగిపోతున్నాయి.

– గద్దల రమేష్, మాజీ సర్పంచ్, చౌటపల్లి గ్రామం

కొత్త పాలక వర్గం వచ్చాక..



పనులు జరిగిన మేరకు బిల్లుల విడుదలకు నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అధికారులకు పంపించాం. త్వరలో విడుదలవుతాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. ప్రారంభోత్సవం కానీ పంచాయతీ భవనాలను కొత్త పాలకవర్గం వచ్చాక నిర్మాణ పనులు చేపడతాం.

– స్నేహ, పంచాయతీరాజ్ ఏఈ

భజనలు.. పల్లకీ సేవ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో హనుమాన్ స్వామి పల్లకీసేవ బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. పల్లకీ సేవలో భక్తులు భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు, మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటా హనుమాన్ పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హనుమాన్ మాలధారణ స్వాములతో సిద్దిపేట సందడిగా మారింది. జిల్లా కేంద్రంలో అధిక సంఖ్యలో హనుమాన్ మాల ధరించడంతో పట్టణంలో ఎటుచూసినా హనుమాన్ స్వాములే దర్శనమిస్తున్నారు. అదే విధంగా ప్రతీ ఇంట్లో హనుమాన్ పూజలు, భజనలు చేస్తుండటంతో వీధివీధిలో హనుమాన్ నామస్మరణ మారుమోగుతున్నాయి.



సిద్దిపేటలో హనుమాన్ భజన చేస్తున్న భక్తులు

ప్రజాపాలన అందించడంలో విఫలం

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదన్

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజాపాలన అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహారాజ్ విమర్శించారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ లోప భూయిష్టమైన విధానాలు, కుటుంబ దోపిడీ పాలనలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా విసిగిపోయిన తెలంగాణ ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అదే నిరాశ ఎదురవుతోందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ పాలనలో ఊకదంపుడు ప్రసంగాలే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వేసవిలోనూ తేమ పేరుతో క్వింటాల్‌కు రెండు నుంచి మూడు కిలోల తరుగు తీస్తున్న మిల్లర్ల దోపిడీని ప్రభుత్వం అరికట్టలేక పోతుందని మండిపడ్డారు. జిల్లాలో సుమారు 5 వేల టన్నుల పచ్చిరొట్ట జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను రైతులకు అందించడంలోనూ సర్కార్ విఫలమైందన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించిన దాఖలాలు లేవని విమర్శించారు. అభివృద్ధి కుంటు పడిపోయిన గ్రామ పంచాయతీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకురాలు జ్యోతి, జిల్లా నాయకులు ర్యాగట్ల చందు, యాదగిరి, దీపక్, అనిల్, కనకరాజు, నర్సింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదన్ మహారాజ్

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

చిన్నకోదూరు(సిద్దిపేట): రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతసాగర్, రామునిపట్ల, మేడిపల్లి గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా విత్తనాల కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. సరైన ప్యాకింగ్, సీల్, లేబుల్, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాల సంచులను కొనుగోలు చేయాలన్నారు. ప్యాకింగ్ లేని, సీల్ తీసి ఉన్న విత్తన సంచులు కొనుగోలు చేయొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన పార్టీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతీ కుటుంబం ఆర్థికంగా బలపడేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. ప్రతీ కార్యకర్తకు లబ్ధి చేకూరే విధంగా తన వంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం విజయ్‌కుమార్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మీసం మహేందర్, రాములు, పర్శరాం, గణేష్, ప్రశాంత్, రాజేందర్, రమేష్, నరహరి, మల్లేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీసం నాగరాజు

కులదూషణ అమానుషం

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత

సిద్దిపేటరూరల్: దళిత యువకులను ఆలయంలోకి రాకుండా అడ్డుకొని కులం పేరుతో దూషించడం అమానుషమని దళిత కుల సంఘాల నాయకులు మండిపడ్డారు. గురువారం సిద్దిపేట మండల పరిధి సీతారాంపల్లి గ్రామంలో హనుమాన్ మాలధరించిన దళిత యువకులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు గ్రామాన్ని ధర్మ సమాజ్ పార్టీ, కుల వివక్ష పోరాట సమితి, దళిత సంఘాల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హనుమాన్ మాల ధరించిన దళిత యువకులను ఆలయంలోనికి రాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. యువకులను కులంపేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. గ్రామంలో కలెక్టర్, సీపీ, సంబంధిత అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కులం పేరుతో దూషిస్తే సహించం

బెజ్జంకి(సిద్దిపేట): దళితులను కులం పేరుతో దూషిస్తే సహించబోమని ఆలిండియా అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడిశెట్టి భూమయ్య గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సిద్దిపేట రూరల్ మండలంలో దీక్షలో ఉన్న దళితులను ఆలయ ప్రవేశానికి అడ్డుతగలడం హేయమైన చర్యన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు డిమాండ్ చేశారు.

1 లోపు రిపోర్టు చేయాలి

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాల కోసం పరీక్ష రాసి రెండో జాబితాలో ఎంపికై ఇంకా రిపోర్టు చేయని విద్యార్థులు జూన్ 1 లోపు రిపోర్టు చేయాలని ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారంతెలిపారు. సీట్లు వచ్చిన బాలికలు సిద్దిపేట, మెదక్, జహీరాబాద్, బాలురు తూప్రాన్, లింగంపల్లి కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. లిస్టు కోసం tgrjc.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



దుబ్బాకలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

దుబ్బాకటౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం సీఐటీయూ కార్యాలయం ఎదుట జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమ చరిత్రలో సీఐటీయూ ఆవిర్భావం ఒక చారిత్రాత్మక అవసర నేపథ్యంలో ఏర్పడిందన్నారు. సంస్థ ఆవిర్భవించి 54 ఏళ్లయ్యిందన్నారు. నూతన కార్మిక చట్టాలను అమలు చేసి కేంద్ర ప్రభుత్వం కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద కార్పొరేట్ విధానాలతో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎయిరిండియా, హిందూస్తాన్ జింక్, ఎల్ఐసీ వంటి వాటిని ప్రైవేటీకరణ చేస్తూ కేంద్రం దేశ సంపదను లూటీ చేస్తోందని మండిపడ్డారు. కార్మికులు ఐకమత్యంగా ఉండకుండా కులం, మతం, అస్తిత్వ భావజాలంతో వారి మధ్య భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కంపెల్లి భాస్కర్, వివిధ రంగాల కార్మికులు ఎల్లయ్య, రాజు, బాల్‌రాజు, మంజుల, లక్ష్మీ, యాదమ్మ, కవిత, వసంత, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ..



నంగునూరులో ..

నంగునూరు(సిద్దిపేట): సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నంగునూరులో సంస్థ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై తాము చేస్తున్న పోరాట ఫలితంగా ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, పర్శ రాములు, బాల్‌నర్సవ్వ, కళవ్వ, పోచవ్వ, కనకవ్వ, భాగ్యవ్వ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



విశ్వనాథపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌నర్సయ్య

కొండపాక(గజ్వేల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య పిలుపు ఇచ్చారు. మండల పరిధిలోని విశ్వనాథపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బర్మ కొమురయ్య, జాలిగామ ప్రభాకర్, ఆరుట్ల నర్సయ్య, కనకాచారి, లక్ష్మి, కనకవ్వ, ఐలయ్య, పర్శ రాములు, కొమురవెల్లి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీఐటీయూ ముందుకు సాగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని సంస్థ కార్యాలయం వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, నాయకులు రవి, రంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, స్వామి, నర్సింహులు, బాబు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎల్లయ్య

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అయిదు రోజుల క్రితం మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన బోయిని రాములు(55) కుటుంబ సభ్యులతో కలిసి నిద్రచేసేందుకు వర్గల్ మండలం నాచారం గుట్టకు అశోక్‌లేలాండ్ గూడ్స్ వాహనంలో వచ్చాడు. సోమవారం అదే వాహనంలో పాములపర్తికి తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా నాచారం సీడ్స్ కంపెనీ సమీపంలో వీరి వాహనం బోల్తాపడింది. రాములుతోపాటు ఆయన భార్య సత్తమ్మ, బంధువులు హంసమ్మ, కనకమ్మ, సాయికుమార్, మైథిలి, నారేని వెంకవ్వ, కొనబోయిన కనకమ్మ, నారేని మదారి, బోయిని పోచవ్వ గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. రాములు(55) లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆ భవనాన్ని కేటాయించొద్దు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని భవనాన్ని నర్మెట్ట గురుకుల పాఠశాలకు కేటాయించడం సరి కాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జరిగిన ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేర్యాలలో ఉన్న భవనంలో నర్మెట్ట గురుకుల పాఠశాల నడపాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. గతంలో ఈ భవనంలో నడిచిన బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను మిట్టపల్లికి తరలించి, ఇప్పుడు నర్మెట్ట గురుకుల పాఠశాలకు భవనం కేటాయించడం సరికాదన్నారు. ఇలా చేస్తే చేర్యాల ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేసినట్లే అన్నారు. స్థానిక ఎస్సీ హాస్టల్‌కి సొంత భవనం లేదని పలుమార్లు కలెక్టర్, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేసినా స్పందించని అధికారులు ఇప్పుడు పట్టణ కేంద్రంలో ఉన్న భవనాన్ని మరో మండల కేంద్రంలో నడిచే పాఠశాలకి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ స్పందించి చేర్యాల ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాకేష్‌రెడ్డి, మహేష్, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **శంకరాచారికి సన్మానం**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి విశ్వకర్మ లెజండరీ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన బాల్య మిత్రులు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకరాచారి సేవలను గుర్తించి అవార్డు ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్‌బాబు, రవి, శ్రీను, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

◆ **జీలుగ వచ్చేనా ?**

బెజ్జంకి(సిద్దిపేట): రోహిణీ కార్తె ప్రవేశించినప్పటికీ పూర్తిస్థాయిలో జనుము, జీలుగ విత్తనాలు మండలానికి రాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భూమిలో పోషకాలు పెరగడానికి జనుము, జీలుగ సాగు చేస్తారు. ఇందుకు విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. కాగా మండలానికి అవసరమైన 18 టన్నులు జీలుగు, జనుము కేటాయించినప్పటికీ కేవలం ఆగ్రోస్ కేంద్రానికి తొమ్మిది టన్నుల జీలుగు, రెండు టన్నుల జనుము విత్తనాలు మాత్రమే వచ్చాయి.

◆ **ధాన్యం సేకరణ పూర్తి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ధాన్యం సేకరణ పూర్తి చేశారు. మొత్తం 19 కొనుగోలు కేంద్రాలలో 2,474 మంది రైతుల నుంచి 1,22,910 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈఓ వాసు, ఏపీఎం నర్సయ్య గురువారం తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలోని పది కొనుగోలు కేంద్రాల్లో 1,499 మంది రైతుల నుంచి 7,1804.08 క్వింటాళ్లు, పీఏసీఎస్ ఆధ్వర్యంలోని 9 కొనుగోలు కేంద్రాల్లో 975 మంది రైతుల నుంచి 51105.60 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

◆ **అంబలి పంపిణీ**

వర్గల్(గజ్వేల్): జాతరకు వచ్చిన భక్తులకు వర్గల్ జెడ్పీటీసీ బాలూయాదవ్ గురువారం రథోత్సవం సందర్భంగా అంబలి కేంద్రం ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అంబలి పంపిణీ చేశారు.

◆ **మృతుల కుటుంబాలకు పరామర్శ**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గ, కొండపాక గ్రామాల్లో మృతి చెందిన ఇండ్ల కిష్టయ్య, పోతుగంటి నర్సింహులు కుటుంబాలను జెడ్పీటీసీ అనంతుల అశ్విని భర్త ప్రశాంత్ గురువారం పరామర్శించారు. రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కిష్టయ్య కుటుంబానికి రూ. 5వేలు, నర్సింహులు కుటుంబానికి రూ 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **టెట్ పరీక్షకు 86 మంది హాజరు**

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు గురువారం 86 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 50 మందికి 42 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 50 మందికి 44 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో రఘు, షాదుల్లా, డీపీ రావు, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

వ్యవసాయ రంగ సమస్యలపై దృష్టి సారించాలి

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

సిద్దిపేట అర్బన్: రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాల్లో రాష్ట్రానికి చెందిన 80 శాతం వాటాలో కేవలం 40 శాతం మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉందని, పూర్తి స్థాయిలో నీటి వినియోగాన్ని వాడుకునే విధంగా మైనర్ ఇరిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధరణిలోని లోపాలను సవరించి అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. పంటల బీమా పథకాన్ని రూపొందించి బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విత్తన చట్టాన్ని రూపొందించాలని, వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళికలు ప్రకటించాలని, వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ ఏర్పాటు చేసి అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, యాదవరెడ్డి, కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు కనకాచారి, మల్లారెడ్డి, భూపతిరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభన్